తెలుగు దినపత్రిక
# డైలీ రిపోర్ట్
DAILY REPORT




సంపుటి: 1 సంచిక: 41 పేజీలు: 4 ఎడిటర్ : బక్క రవీందర్ ప్రచురణ: తెలంగాణ గురువారం 12-09-2023 వెల: 5/రూ -

## రాహుల్ వ్యాఖ్యలకు ఉగ్రవాది పన్నూ మద్దతు


మా ఖలిస్థాన్ డిమాండ్‌ను సమర్థించేలా ఉన్నాయి: పన్నూ

రాహుల్ వ్యాఖ్యలకు నిరసనగా ఢిల్లీలో సిక్కుల ఆందోళన

ఇల్హాన్ ఒమర్‌తో రాహుల్ గాంధీ సమావేశంపైనా వివాదం



2లో



## 60 రోడ్లు.. 1,712 కిలోమీటర్లు!

హైదరాబాద్: రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న రీజనల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్) నిర్మాణంపై ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేసింది. ఉత్తర, దక్షిణ రెండు భాగాలుగా 352 కిలోమీటర్ల మేర విస్తరించి ఉండే.. రీజనల్ రింగ్ రోడ్డులో భాగంగా 1,712 కిలోమీటర్ల పొడవునా మొత్తం 60 రేడియల్ రోడ్లను నిర్మించేందుకు రంగం సిద్ధం చేసింది. ఇందులో తొలి, రెండో దశలో 1,281 కిలోమీటర్ల మేర

# బూత్ లెవెల్ ఏజెంట్లను ఏర్పాటు చేసుకోవాలి

## జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు



**సంగారెడ్డి, సెప్టెంబర్ 11 (డైలీ రిపోర్ట్):** గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు పోలింగ్ బూత్ లెవెల్ ఏజెంట్లను ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ క్రాంతి వల్లూరు సూచించారు. కలెక్టర్ ఛాంబర్ లో బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎస్ఎస్ఆర్ - 2025 లో భాగంగా బీ.ఎల్.ఓ లు ఇంటింటికి వెళ్లి బీఎల్ఓ యాప్ ద్వారా కుటుంబ సభ్యుల పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయో లేదో నిర్ధారణ చేసుకోవడం జరుగుతోందన్నారు.



## చెరువుల్ని వదలకుంటే

# చెరసాలకే!

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరిక చెరువులు, కుంటలు, నాలాల ఆక్రమణల వల్లే వరదలు

ఆక్రమించుకున్న చెరువులను స్వచ్ఛందంగా వదిలేయాలని విజ్ఞప్తి చేస్తున్నా..

లేకపోతే ఎంత గొప్పవారైనా అక్రమ నిర్మాణాల కూల్చివేత తప్పదు

స్టే తెచ్చుకుంటే కోర్టుల్లో కొట్లాడతాం..అవసరమైతే జైలుకు పంపిస్తాం

ఎఫ్టీఎల్, బఫర్ జోన్ల పరిధిలో నిర్మాణాల క్రమబద్ధీకరణ ప్రసక్తే లేదు

ఎస్ఐల పాసింగ్ అవుట్ పరేడ్‌లో పాల్గొన్న సీఎం

ప్రజల్లో విశ్వాసాన్ని, పోలీసులపై గౌరవాన్ని పెంచేలా పనిచేయాలని సూచన

2లో

కాస్మెటిక్ పోలీసింగ్ కాదు.. కాంక్రీట్ పోలీసింగ్ అవశ్యమని వ్యాఖ్యసాక్షి, హైదరాబాద్/బండ్లగూడ: 'చెరువులు, కుంటలు, నాలాల ఆక్రమణల వల్లే వరదలు వస్తున్నాయి. వరదలతో పేదల జీవితాలు అతలాకుతలం అవుతున్నాయి. ఫాంహౌస్‌ల నుంచి వచ్చే డ్రైనేజీని గండిపేటలో కలుపుతున్నారు. అందుకే చెరబట్టిన వారి నుంచి చెరువులను విడిపిస్తున్నాం. ఆక్రమించుకున్న చెరువులను స్వచ్ఛందంగా వదిలేయాలని ఆక్రమణ దారులకు విజ్ఞప్తి చేస్తున్నా..లేకపోతే చెరువులలోని అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేసి తీరుతాం. నాలాలపై ఆక్రమణలను కూడా తప్పనిసరిగా కూల్చేస్తాం. కూల్చివేతలపై స్టే తెచ్చుకుంటే కోర్టుల్లో కొట్లాడతాం.




## కాంగ్రెస్ ప్రచారానికి వాల్మీకి స్కామ్ డబ్బు

నిధులను దారిమళ్లించిన నేతలను శిక్షించాలి: కేటీఆర్

హైదరాబాద్: కర్ణాటకలో గిరిజన సంక్షేమానికి ఖర్చు చేయాల్సిన సొమ్మును కాంగ్రెస్

2లో



## 70 ఏళ్లు పైబడిన వారందరికీ రూ.5 లక్షల ఆరోగ్య బీమా

# రికార్డు స్థాయిలో కృష్ణమ్మ వరద

ఇప్పటివరకు శ్రీశైలం జలాశయానికి 1,139 టీఎంసీల వరదనీరు

రెండు నెలల్లో 858 టీఎంసీల నీరు గేట్ల ద్వారా కిందకు విడుదల

పదిరోజుల్లోనే డెడ్‌స్టోరేజీ నుంచి పూర్తినిల్వ సామర్థ్యానికి చేరుకున్న వైనం

ఇప్పటివరకు నాలుగు పర్యాయాలు ప్రాజెక్ట్ గేట్లు ఎత్తిన అధికారులు



నాగర్‌కర్నూల్: ఈసారి వానాకాలం సీజన్‌లో కృష్ణానదిలో రికార్డుస్థాయిలో వరద పోటెత్తింది. గడిచిన 50 రోజులుగా శ్రీశైలం ప్రాజెక్టుకు భారీగా వరద ప్రవాహం కొనసాగుతోంది. ఎగువన తుంగభద్ర, కృష్ణానదిలో పెరిగిన నీటి ప్రవాహంతో కేవ లం పదిరోజుల్లోనే శ్రీశైలం ప్రాజెక్ట్ పూర్తిస్థాయిలో నిండింది. ఈ ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం 215.807 టీఎంసీలు కాగా, ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరదతో ఇప్పటివరకు 1,139 టీఎంసీల నీ రు శ్రీశైలం జలాశయానికి చేరింది.



## అదే జగన్.. అవే అబద్ధాలు!

నాడు 36 రాజకీయ హత్యలని బొంకులు

నేడు 60 మంది చనిపోయారని అబద్ధాలు

నిరూపించాలని మంత్రులు, నేతల డిమాండ్

నిరూపించలేక చేతులెత్తేసిన వైసీపీ అధినేత

అబద్ధాలతో పుట్టి ఫేక్‌లో పెరిగారని నేతల ధ్వజం

అన్నమయ్య డ్యాం వరదకు కొట్టుకుపోయినప్పుడు

కిక్కురుమనలేదంటూ నిప్పులు చెరిగిన మంత్రులు

క్రిమినల్ వెళ్లి మరో నేరస్థుడికి పరామర్శా అని ఎద్దేవా

అమరావతి: వై సీపీ అధినేత, మాజీ సీఎం జగన్ గుంటూరు జైలు వద్ద చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. జైల్లో ఉన్న మాజీ ఎంపీ నందిగం సురేశ్‌ను పరామర్శించిన

2లో

# 70 ఏళ్లు పైబడిన వారందరికీ రూ.5 లక్షల ఆరోగ్య బీమా

(మొదటి పేజీ తరువాయి)

న్యూఢిల్లీ: డెబ్బై ఏళ్లు, ఆ పైబడిన వృద్ధుల ఆరోగ్య సంక్షేమానికి పెద్దపీట వేస్తూ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఆదాయంతో నిమిత్తం లేకుండా వృద్ధులందరికీ ఆయుష్మాన్ భారత్ ప్రధాన్‌మంత్రి జన్ ఆరోగ్య యోజన (ఏబీపీఎంజేఏవై) కింద రూ.5 లక్షల ఉచిత ఆరోగ్య బీమాకు కేంద్ర కేబినెట్ అంగీకారం తెలిపింది. బుధవారం ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేబినెట్ పలు ప్రతిపాదనలను ఆమోదించింది. అర్హులైన లబ్ధిదారులకు త్వరలో కొత్త కార్డులు మంజూరు చేయనున్నట్లు తెలిపింది.కుటుంబసభ్యులు ఏబీపీఎంజేఏవై కింద లబ్దిదారులుగా ఉన్నా 70 ఏళ్లు, ఆపై వయసు సీనియర్ సిటిజన్లకు విడిగా ఏటా రూ.5 లక్షల ఆరోగ్యబీమా కల్పించనున్నారు. వృద్ధులు ప్రైవేట్ ఆరోగ్య బీమా పాలసీలు, ఈఎస్ఐ పథకంలో ఉన్నా ఈ పథకం వర్తిస్తుంది. కేంద్రప్రభుత్వ ఆరోగ్య పథకం(సీజీహెచ్ఎస్), మాజీ సైనికుల కంట్రిబ్యూటరీ హెల్త్ స్కీమ్ (ఈసీహెచ్ఎస్), ఆయుష్మాన్ సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ (సీఏపీఎఫ్) పథకాల లబ్ది పొందుతున్న వాళ్లు మాత్రం వాటినో, ఏబీపీఎంజేఏవైనో ఏదో ఒకదానినే ఎంచుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో 4.5 కోట్ల కుటుంబాల్లోని వృద్ధులకు మేలు చేకూరనుంది. ఏబీపీఎంజేఏవై ప్రపంచంలోనే ప్రభుత్వరంగంలో అమలవుతోన్న అతిపెద్ద ఆరోగ్యబీమా పథకమని కేంద్రం తెలిపింది. 12.34 కోట్ల కుటుంబాల్లోని 55 కోట్ల మందికి ఈ పథకం లబ్దిచేకూరుస్తుందని కేంద్రం పేర్కొంది. వయసుతో సంబంధంలేకుండా కుటుంబంలోని అందరికీ ఈ పథకం వర్తిస్తుంది. ఈ పథం కింద ఇప్పటికే 7.37 కోట్ల మంది ఆస్పత్రిలో వైద్యసేవలు పొందారు.

# రాహుల్ వ్యాఖ్యలకు ఉగ్రవాది పన్నూ మద్దతు

(మొదటి పేజీ తరువాయి)

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11: 'భారత్‌లో ఓ సిక్కు టర్బన్, కడెం ధరించేందుకు, గురుద్వారాకు వెళ్లేందుకు అనుమతి ఉంటుందా అనే దానిపై పోరాటం జరుగుతున్నది' అంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను ఖలిస్థానీ ఉగ్రవాది, సిక్స్ ఫర్ జస్టిస్ సహ వ్యవస్థాపకుడు గురుపత్వంత్ సింగ్ పన్నూ సమర్థించారు. అమెరికా పర్యటనలో భాగంగా వర్జీనియాలో జరిగిన ఓ కార్యక్రమంలో సోమవారం రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు రాహుల్ వ్యాఖ్యలపై స్పందించిన పన్నూ.. భారత్‌లో సిక్కులకు ఉన్న ముప్పుపై రాహుల్ చేసిన వ్యాఖ్యలు ధైర్యంతో, మార్గదర్శకంగా చేసినట్టు ఉన్నాయని పేర్కొన్నారు. భారత్‌లో 1947 నుంచి సిక్కులు ఎదుర్కొంటున్న వాస్తవిక పరిస్థితులను చాటేలా రాహుల్ వ్యాఖ్యలు ఉన్నాయని, తమ ఖలిస్థాన్ ఏర్పాటు డిమాండ్‌ను సమర్థిస్తున్నాయని పేర్కొన్నారు. కాగా, రాహుల్ వ్యాఖ్యలను నిరసిస్తూ బుధవారం ఢిల్లీలోని ఆయన నివాసం వద్ద సిక్కులు ఆందోళనకు దిగారు.అమెరికా పర్యటనలో భాగంగా అక్కడి హౌజ్ ఆఫ్ రిప్రజెంటేటీవ్స్ సభ్యురాలు ఇల్హాన్ ఒమర్‌తో రాహుల్ గాంధీ సమావేశం కావడం దుమారం రేపుతున్నది. తరచూ భారత వ్యతిరేక వ్యాఖ్యలు చేస్తూ, అమెరికా చట్టసభలో భారత్‌కు వ్యతిరేకంగా తీర్మానాలు ప్రవేశపెట్టే ఇల్హాన్‌తో రాహుల్ సమావేశం కావడాన్ని బీజేపీ తీవ్రంగా తప్పుబట్టింది.

# 60 రోడ్లు.. 1,712 కిలోమీటర్లు!

(మొదటి పేజీ తరువాయి)

32 రేడియల్ రోడ్లను, మూడో దశలో 28 లింక్ రోడ్లను నిర్మించాలని నిర్ణయించింది. రేడియల్ రోడ్లు 200 అడుగుల వెడల్పుతో ఉంటాయి. ప్రధాన రేడియల్ రోడ్ వంద అడుగులు కాగా.. భవిష్యత్తు అవసరాల కోసం దానికి ఇరువైపులా 50 అడుగుల చొప్పున బఫర్‌గా ఉంచుతారు. లీ అసోసియేట్స్‌కు 10 రేడియల్ రోడ్లు ప్రభుత్వం ట్రిపుల్ ఆర్ ఇంటిగ్రేటెడ్ మాస్టర్ ప్లాన్ రూపకల్పన, సాంకేతిక సేవల బాధ్యతలను కెనడాకు చెందిన లీ అసోసియేట్స్ సౌత్ ఏషియా సంస్థకు అప్పగించింది. ఉత్తర భాగంలో ఓఆర్ఆర్, ట్రిపుల్ ఆర్‌ను కలిపేందుకు 10 రేడియల్ రోడ్ల నిర్మాణ పనులను ఈ సంస్థకు అప్పగించారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమీక్షా సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఇప్పటికే ఈ సంస్థ హెచ్ఎండీఏ, టీజీఆర్డీసీ, ఓఆర్ఆర్ రోడ్ల నిర్మాణం, మాస్టర్ ప్లాన్ వంటి ప్రాజెక్టులను పూర్తి చేసింది. %మూడు దశల్లో రేడియల్ రోడ్ల స్వరూపమిదీ: 5 రేడియల్ రోడ్లు ఓఆర్ఆర్ నుంచి రీజనల్ రింగ్‌రోడ్డుకు అనుసంధానమై ఉంటాయి. మిగతా 11 రేడియల్ రోడ్లలో 9 జాతీయ రహదారులు, 2 రాష్ట్ర రహదారులను కలుపుతూ ట్రిపుల్ ఆర్, ఓఆర్ఆర్ గుండా సాగుతాయి. ' ఓఆర్ఆర్‌తో అనుసంధానమయ్యే రోడ్లలో.. యాద్గార్‌పల్లి నుంచి ఇటిక్యాల వరకు, కీసర నుంచి దత్తాయిపల్లి, నాగులపల్లి నుంచి మందాపూర్, నార్సింగి నుంచి చీమలదరి, రాజేంద్రనగర్ ఓఆర్ఆర్ ఎగ్జిట్ నంబరు%-%17 నుంచి కంకాల్ వరకు నిర్మించనున్నారు.

## కాంగ్రెస్ ప్రచారానికి వాల్మీకి స్కామ్ డబ్బు

తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం వాడుకుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఆరోపించారు. వాల్మీకి స్కామ్‌గా చెప్తున్న ఈ కుంభకోణంలో నిధులను దారి మళ్లించి వాడుకున్న కాంగ్రెస్ నేతలను శిక్షించాలని బుధవారం 'ఎక్స్'వేదికగా ఆయన డిమాండ్ చేశారు. 'వాల్మీకి కుంభకోణంలో కాంగ్రెస్ నేత, కర్ణాటక మాజీ మంత్రి బి.నాగేంద్రను కీలక సూత్రధారిగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తన చార్జ్‌షీట్‌లో నిర్ధారించింది. కర్ణాటక మహర్షి వాల్మీకి షెడ్యూల్డ్ ట్రైబ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు చెందిన రూ.187 కోట్లు కాంగ్రెస్ మంత్రి చేతుల మీదుగా దారి మళ్లాయి. ఆ సొమ్మును తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇటీవలి లోక్‌సభ ఎన్నికల కోసం ఉపయోగించింది. ఎన్నికల సందర్భంగా ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఉపయోగించిన రూ.20 కోట్ల నగదు కాంగ్రెస్ కీలక నాయకుడి అనుచరుడిదే అని తేలింది. ఈ స్కామ్‌లో హైదరాబాద్‌కు చెందిన బిల్డర్ సత్యనారాయణ వర్మ ప్రధాన నిందితుడు.తెలంగాణకు చెందిన ఇద్దరు కీలక కాంగ్రెస్ నేతలకు సత్యనారాయణ వర్మ అత్యంత సన్నిహితుడు. ఇతనికి సంబంధించిన వ్యాపారంలోనూ ఇక్కడి కాంగ్రెస్ నేతలు భాగస్వాములుగా ఉన్నట్టు అనుమానాలు ఉన్నాయి. అవినీతిని పెంచి పోషించి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే కాంగ్రెస్ అసలు సిసలు నైజం. దర్యాప్తు సంస్థలు వాల్మీకి స్కామ్‌లో నిజాలు నిగ్గు తేల్చి దోషులను కఠినంగా శిక్షించాలి..'అని కేటీఆర్ డిమాండ్ చేశారు. లోతుగా విచారణ జరి పితే తెలంగాణ కాంగ్రెస్‌లోని పెద్ద నాయకుల పేర్లు బయటకు వస్తాయని అన్నారు.

# రికార్డు స్థాయిలో కృష్ణమ్మ వరద

(మొదటి పేజీ తరువాయి)

శ్రీశైలం ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటిని కిందకు విడుదల చేయడంతో గత 50 రోజుల్లో 558 టీఎంసీల నీరు దిగువనున్న నాగార్జునసాగర్‌కు విడుదల చేశారు. గత రెండేళ్లలో శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి కూడా చేరుకోలేదు. ఈ సారి కృష్ణానదిలో భారీ స్థాయిలో వచ్చి న వరదలకు జూలై చివరకల్లా ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యానికి చేరుకుంది. కృష్ణమ్మ పరవళ్లతో ఈసారి కేవలం పదిరోజుల వ్యవధిలోనే శ్రీశైలం ప్రాజెక్టు డెడ్‌స్టోరేజీ నుంచి ప్రాజెక్టు స్పిల్‌వే ద్వారా నీటిని విడుదల చేసే వరకు చేరింది. జూలై నెల ప్రారంభంలో నీరు లేక వెలవెలబోయిన ప్రాజెక్టు చివరికల్లా నిండుకుండలా మారింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 215.807 టీఎంసీలకు జూలై 20 నాటికి కేవలం 35.629 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. గరిష్ట నీటిమట్టం 885 అడుగులకు జలాశయంలో నీటినిల్వ 812.30 అడుగులకు మాత్రమే పరిమితమైంది. అయితే తుంగభద్ర నదితో పాటు కృష్ణానదికి ఎగువ ప్రాంతం నుంచి వరద ప్రవాహం పెరగడంతో అనూహ్యంగా పదిరోజుల వ్యవధిలోనే శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండింది. తొమ్మిది రోజుల్లోనే 179 టీఎంసీల నీరు ప్రాజెక్టులో వచ్చి చేరింది. దీంతో జూలై 30న అధికారులు ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటిని కిందకు విడుదల చేశారు. ఆగస్టు, సెప్టెంబర్‌లోనూ నిత్యం 1.50 లక్షల క్యూసెక్కులకు పైగా నీటి ప్రవాహం కొనసాగడంతో ఇప్పటివరకు నాలుగు పర్యాయాలు గేట్లను ఎత్తి స్పిల్‌వే ద్వారా నీటిని కిందకు వదిలారు. ఆగస్టు నెలలో వరద ఉధృతి ఎక్కువగా ఉండటంతో



సుమారు 20 రోజుల పాటు ప్రాజెక్టు పదిగేట్లను ఎత్తి నీటిని నాగార్జున సాగర్‌కు విడుదల చేశారు.

శ్రీశైలం ఎడమ గట్టున ఉన్న తెలంగాణ భూగర్భ జలవిద్యుత్ కేంద్రానికి నిత్యం 37 వేల క్యూసెక్కుల నీరు విడుదల అవుతుండగా రోజుకు 17 నుంచి 18 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. ఇప్పటి వరకు ప్రాజెక్టు నుంచి భూగర్భ జలవిద్యుత్ కేంద్రానికి మొత్తం 152.74 టీఎంసీల నీటిని విడుదల చేశారు. ఈ కేంద్రంలో మొత్తం ఆరు యూనిట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యం 900 మెగావాట్లు కాగా, ప్రస్తుతం ఐదు యూనిట్ల ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. గత జూలై 16 నుంచి భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించగా, నిత్యం 35 వేల క్యూసెక్కులకు పైగా నీటితో గరిష్ట స్థాయిలో విద్యుదుత్పత్తిని కొనసాగిస్తున్నారు.

# చెరువుల్ని వదలకుంటే చెరసాలకే!

(మొదటి పేజీ తరువాయి)జ



అవసరమైతే ఆక్రమణదారులను జైలుకు పంపేందుకూ వెనకాడం..'అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. చెరువులు, నాలాల ఆక్రమణలు తొలగించే లక్ష్యంతోనే హైడ్రాను ఏర్పాటు చేశామని, ఆక్రమణదారులు ఎంత గొప్పవారైనా చర్యలు తప్పవని చెప్పారు. ఇదే తమ ప్రభుత్వ విధానమని పేర్కొన్నారు. చెరువుల ఎఫ్టీఎల్, బఫర్ జోన్ల పరిధిలో నిర్మాణాలను క్రమబద్ధం చేసే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. రాజా బహదూర్ వెంకటరామారెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీలో బుధవారం నిర్వహించిన ఎస్ఐల దీక్షాంత్ పరేడ్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 145 మంది మహిళలు సహా 547 మంది సివిల్ ఎస్ఐలు, రిజర్వ్ ఎస్ఐలు, ఏఎస్ఐల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. శిక్షణలో భాగంగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ట్రోఫీలను బహూకరించారు. పాసింగ్ అవుట్ పరేడ్ కమాండర్‌గా వ్యవహరించిన పల్లి భాగ్యశ్రీని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ముఖ్యమంత్రి ప్రసంగించారు.

**డ్రగ్స్, గంజాయిపై ఉక్కుపాదం మోపాలి**

'పోలీస్ ఉద్యోగాన్ని కేవలం ఉద్యోగ బాధ్యతగా మాత్రమే కాదు.. రాష్ట్ర ప్రజలను కాపాడే ఉద్యోగంగా, భావోద్వేగంతో చూడాలి. ప్రకృతి విపత్తులైనా, శాంతిభద్రతల సమస్యలైనా, ఏ ఇతర సమస్య వచ్చినా ముందుగా అందుబాటులో ఉండేది పోలీసులే. ఆ మేరకు ప్రజల్లో విశ్వాసాన్ని, పోలీసులపై గౌరవాన్ని పెంచేలా పనిచేయాలి. రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయిపై ఉక్కు పాదం మోపాలి. సైబర్ నేరాలకు తావులేకుండా యువ పోలీస్ అధికారులు పనిచేయాలి. డ్రగ్స్, గంజాయి పేరు వింటేనే వెన్నులో వణుకు పుట్టాలి. ఆక్రమణల కూల్చివేతలు, డ్రగ్స్ కట్టడి సహా ప్రభుత్వ అన్ని నిర్ణయాలను అమలు చేయాల్సిన బాధ్యత యువ అధికారులపై ఉంది. కాస్మొటిక్ పోలీసింగ్ కాదు.. కాంక్రీట్ పోలీసింగ్ అవసరం. ఫ్రెండ్లీ పోలీసింగ్ అనేది బాధితులతోనే.. నేరస్తులతో కాదు. మీ అందరినీ చూస్తోంటే తెలంగాణ డ్రగ్స్ రహితంగా మారుతుందన్న విశ్వాసం కలుగుతోంది..'అని సీఎం అన్నారు. సైనిక్ స్కూళ్ల మాదిరిగా హైదరాబాద్, వరంగల్‌లో ఒక్కొక్కటి 50 ఎకరాలతో రెండు రెసిడెన్షియల్ పోలీస్ స్కూళ్లు ఏర్పాటు చేస్తాం. హోంగార్డు నుంచి డీజీపీ పిల్లల వరకు ఉచితంగా చదువుకునే ఏర్పాటు చేస్తాం. ఇందుకు సంబంధించి డీజీపీ జితేందర్, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి చర్యలు తీసుకోవాలి..'అని ముఖ్యమంత్రి ఆదేశించారు.

**ఏడాది చివర్లో కొత్తగా 35 వేల ఉద్యోగాలు**

'కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టుబడులు తీసుకురావడమే కాదు.. రైతన్నలు, నేతన్నలు, గీతన్నలను ఆదుకుంటోంది. కేవలం 28 రోజుల్లోనే 22.22 లక్షల రైతుల ఖాతాల్లో రూ.18 వేల కోట్లు వేసి రుణమాఫీ చేశాం. తెలంగాణ వచ్చినా గత తొమ్మిదేళ్లలో నిరుద్యోగుల ఆకాంక్షలు నెరవేరలేదు. గతంలో జిరాక్స్ సెంటర్లలో టీజీపీఎస్సీ ప్రశ్నపత్రాలు లభించే దారుణ పరిస్థితి ఉండేది. మా ప్రజా ప్రభుత్వంలో నిర్వహిస్తున్న ఉద్యోగ పరీక్షలపై నిరుద్యోగులకు ఎలాంటి అనుమానాలు లేవు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేశాం. గ్రూప్-2 పరీక్ష వాయిదా వేసి నిరుద్యోగులకు అనుకూలంగా నిర్ణయం తీసుకున్నాం. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే 30 వేల ఉద్యోగాలను భర్తీ చేశాం. ఏడాది చివరికి కొత్తగా 35 వేల ఉద్యోగాలు ఇస్తాం..'అని ముఖ్యమంత్రి వెల్లడించారు. డీజీపీ జితేందర్ మాట్లాడుతూ.. శాంతిభద్రతలు కాపాడడంలో, ప్రజలకు న్యాయం చేయడంలో ఎస్ఐల పాత్ర కీలకం అని అన్నారు. ప్రజల విశ్వాసాన్ని పొందేలా పనిచేయాలని యువ అధికారులకు సూచించారు. కాగా పోలీస్ అకాడమీలో శిక్షణ సంబంధిత వివరాలను పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ ఈ సందర్భంగా వివరించారు.

# బూత్ లెవెల్ ఏజెంట్లను ఏర్పాటు చేసుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)



ఈ నేపథ్యంలో ఇంటింటి సర్వేకు తోడ్పాటును అందిస్తూ ఓటరు జాబితా పక్కాగా రూపొందేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. అవసరం ఉన్న చోట పోలింగ్ కేంద్రాలను విభజించడం, కొత్త వాటిని ఏర్పాటు చేయడం జరుగుతుందని, అలాంటి పోలింగ్ స్టేషన్లను గుర్తిస్తే, వాటి వివరాలను తమ దృష్టికి తేవాలని సూచించారు. అక్టోబర్ 29న ఓటరు జాబితా డ్రాఫ్ట్ రోల్ ప్రకటించడం జరుగుతుందని, దానిని పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల పేర్లను జాగ్రత్తగా పరిశీలించాలని అన్నారు. ఈ ప్రక్రియ కోసం రాజకీయ పార్టీలన్నీ పోలింగ్ బూత్ ల వారీగా ఏజెంట్లను ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అక్టోబర్ 29 నుండి నవంబర్ 28 వ తేదీ లోపు రెండు పర్యాయాలు పోలింగ్ బూత్ స్థాయిలో స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించడం జరుగుతుందన్నారు. డ్రాఫ్ట్ రోల్ లో ఏవైనా అభ్యంతరాలు ఉంటే స్పెషల్ క్యాంపెయిన్ సందర్భంగా దరఖాస్తు చేసుకుంటే వాటిని పరిశీలించి సవరించడం జరుగుతుందన్నారు. ఓటరు జాబితాలో ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ, మాజీ జెడ్పీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్సీలు, ఇతర ప్రముఖుల పేర్లు ఉన్నాయా, లేదా అన్నది క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని సూచించారు. 2025 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటరుగా పేరు నమోదు చేసుకునే విధంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు చూడాలని కోరారు. అర్హులైన వారు ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు ఆంథోనీ , వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అదే జగన్.. అవే అబద్ధాలు!

(మొదటి పేజీ తరువాయి)

జగన్ అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వంపైన, సీఎం చంద్రబాబుపైనా విమర్శలు చేశారు. అయితే, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైన కొద్ది రోజులకే ఢిల్లీ వెళ్లిన జగన్ అక్కడ మాట్లాడు తూ.. రాష్ట్రంలో తమ పార్టీకి చెందిన వారిని వేటాడుతున్నారని, ఈ కొద్ది రోజుల్లో 36 రాజకీయ హత్యలు జరిగాయని ఆరోపించారు. దీనిపై ప్రభుత్వ పక్షం స్పందించింది. జగన్ నిజాయితీపరుడైతే ఆయన చెబుతున్న 36 మంది పేర్లు, చిరునామాలు ఇవ్వాలని డిమాండ్ చేసింది. అయినప్పటికీ జగన్ స్పందించలేదు. సరిగ్గా అదే పద్ధతిలో బుధవారం కూడా మాట్లాడారు. విజయవాడ వరదల్లో 60 మంది మరణించారని, దీనికి ప్రభుత్వ వైఫల్యమే కారణమని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలపై కూడా ప్రభుత్వ పక్షం సూటి ప్రశ్నలు సంధించింది. జగన్ చెప్పింది నిజమే అయితే ఆ 60 మంది పేర్లు ఇవ్వాలని డిమాండ్ చేసింది. జగన్ అబద్ధంతో జన్మించాడని, ఫేక్‌తో పెరిగాడని మంత్రి అనగాని సత్య ప్రసాద్ ధ్వజమెత్తారు. 'జనం కష్టాల్లో ఉంటే వారిని పట్టించుకోకుండా జైలు కు వెళ్లి ఒక క్రిమినల్‌ను పరామర్శించారు విజయవాడలో 6 లక్షల మంది ప్రజలు వరదలో చిక్కుకోవడానికి జగన్ చేసిన పాపాలే కారణం' అన్నారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు కడప లో అన్నమయ్య డ్యాం కొట్టుకుపోతే కిక్కురుమనలేదని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దుయ్యబట్టారు. 'పింఛా నదికి వరదలు వస్తున్నట్టు తెలిసినా అన్నమయ్య డ్యాం గేట్లు ఎత్తలేదు. ఇసుక తవ్వుతున్న తమ పార్టీ మాఫియాకు ఇబ్బందని గేట్లు తెరవనీయకుండా ఆపారు. డ్యాం కొట్టుకుపోవడంతో 7 ఊళ్లు సర్వనాశనం అయ్యాయి. 38 మంది మరణించారు. జనం ఇంకా గుడారాల్లోనే ఉంటున్నారు' అన్నారు. నేరస్తుడు జగన్‌కు ప్రజల కష్టాలు పట్టించుకునే తీరికలేదు కానీ, జైలు లో ఉన్న నేరస్తులను మాత్రం పరామర్శించే తీరిక ఉందని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. బుడమేరు విస్తరణకు టీడీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసి 70 శాతం పనులు పూర్తిచేసిందని, ఆ తరువాత తట్ట మట్టి కూడా వేయని జగన్ ఏముఖం పెట్టుకుని మాట్లాడతారని విమర్శించారు. ఏ కుట్రా లేకపోతే గుంటూరు జిల్లా వైపు ఉన్న బోట్లు ప్రకాశం బ్యారేజీకి ఎందుకు వచ్చాయని నిలదీశారు. జగన్ రాజకీయ జీవితానికి ఫుల్‌స్టాఫ్ పడిందని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు.

# మోకిల గ్రామ ప్రజల సమస్యలను తీర్చండి

## కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన కాంగ్రెస్, బిఆర్ఎస్ నాయకులు

శంకర్‌పల్లి: సెప్టెంబర్ 11: (డైలీ రిపోర్ట్): మోకిల గ్రామ సమస్యలను తీర్చండని కాంగ్రెస్, బిఆర్ఎస్ నాయకులు బుధవారం కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ నాలాల దారిని కబ్జా చేసి అక్రమ కట్టడాలు కట్టారని, భారీ వర్షాల కారణంగా వర్షపు నీరు ఇళ్లలోకి చేరి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విడతల వారీగా గ్రామ సమస్యలను తీరుస్తానని కలెక్టర్ హామీ ఇచ్చినట్టు వారు పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో బిఆర్ఎస్ పార్టీ మండల మైనార్టీ అధ్యక్షుడు ఫరీద్, కాంగ్రెస్ నాయకులు వాజిద్, సత్యం, శేఖర్, వెంకట్, అహ్మద్, షబ్బీర్, రషీద్, యాసిన్, ఖాజా బాషా, నజీర్ ఉన్నారు.



## రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

11 సెప్టెంబర్ ఎ (డైలీ రిపోర్ట్ ) రంగారెడ్డి జిల్లా చేవెళ్లలోని మాము ధాబా దగ్గర చేవెళ్ల మండలం గుండాల గ్రామానికి చెందిన బాలగళ్ల కృష్ణయ్య (45) చేవెళ్ల నుంచి గుండాల గ్రామానికి వెళ్తున్న క్రమంలో మాము ధాబా దగ్గర బైక్ స్కిడ్ అయ్యి కింద పడటంతో తలకు బలమైన గాయం తగిలింది రక్తస్రావం జరిగింది వెంటనే స్థానికులు ఆంబులెన్సులు చేవెళ్ల ప్రభుత్వానికి తరలించారు ప్రాణాపాయ స్థితిలో ఉండడంతో వెంటనే ఉస్మానియా హాస్పిటల్ కి తరలించారు మిగతా విషయాలు తెలియాల్సి ఉంది.





## గణనాధుడిని ప్రతి ఒక్కరు భక్తిశ్రద్ధలతో పూజించాలి: కాంగ్రెస్ మున్సిపల్ యూత్ లీడర్ శ్వేతా రాఘవేందర్

శంకర్‌పల్లి: సెప్టెంబర్ 11: (డైలీ రిపోర్ట్): గణనాధుని భక్తిశ్రద్ధలతో ప్రతి ఒక్కరూ పూజించాలని శంకర్‌పల్లి కాంగ్రెస్ మున్సిపల్ యూత్ లీడర్ శ్వేతా రాఘవేందర్ అన్నారు. బుధవారం శ్రీ వరసిద్ధి వినాయక సేవా సంఘం ఆధ్వర్యంలో నెల కల్పిన వినాయకుడికి ఆమె ప్రత్యేక పూజలు చేసి, స్వామివారిని దర్శించుకున్నారు. శ్వేత మాట్లాడుతూ ప్రజల సర్వ విఘ్నాలను తొలగించి సర్వ శుభాలను ప్రసాదించాలని స్వామిని కోరుకున్నట్టు పేర్కొన్నారు. పూజా కార్యక్రమంలో మహిళలు అరుణ, శివాని, పద్మ, నందిని, లాస్య, వాణి, శారద, శ్రీలత, రాజేశ్వరి, శ్రీజ పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం వేడుకలు...

## వినాయక నిమజ్జనానికి కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు..

## ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ రూపేష్..

**పటాన్చెరు, సెప్టెంబర్ 10 (డైలీ రిపోర్ట్) :** వినాయక నిమజ్జన కార్యక్రమాలను ప్రజలంతా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేష్ పిలుపునిచ్చారు. వినాయక నిమజ్జన కార్యక్రమంలో భాగంగా పటాన్ చెరు, అమీన్ పూర్, బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో నిమజ్జనం సంధర్భంగా చెరువులపై చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ వేడుకలలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా, నీళ్లలోకి ఎవ్వరూ దిగకుండా బారికెట్స్ ఏర్పాటు చేయాలని, చెరువుల వద్ద విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసే విధంగా సంభందిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని స్థానిక పోలీస్ అధికారులకు సూచించారు. నిమర్జనానికి వచ్చి, పోయే వాహనాలకు ఇబ్బంది లేకుండా వెళ్ళడానికి అప్ అండ్ డౌన్ రోడ్లు వేరు వేరుగా ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి చెరువు వద్ద గజ ఈతగాళ్లు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు.ఎలాంటి భద్రత పరమైన సమస్యలు తలెత్తకుండా మొబైల్ పెట్రోలింగ్ చేస్తూ ట్రాఫిక్ ను కంట్రోల్ చేయాలన్నారు. ఆయన వెంట అదనపు ఎస్పీ ఎ.సంజీవ రావు, పటాన్ చెర్ డీఎస్పీ రవీందర్ రెడ్డి, పటాన్ చెరు ఇన్స్పెక్టర్ ప్రవీణ్ రెడ్డి, అమీన్ పూర్ ఇన్స్పెక్టర్ సదా నాగరాజు, తదితరులు ఉన్నారు.







## గణేష్ నగర్ వినాయకుడికి ప్రత్యేక పూజలు చేసిన శంకర్‌పల్లి మాజీ ఎంపిటిసి బిసొల్ల అశోక్ కుమార్

**శంకర్‌పల్లి: సెప్టెంబర్ 11: (డైలీ రిపోర్ట్):** శంకర్‌పల్లి మున్సిపల్ పరిధి రెండవ వార్డు గణేష్ నగర్ కాలనీలో నెలకొల్పిన వినాయకుని మండపంలో శంకర్‌పల్లి మాజీ ఎంపిటిసి బిసొల్ల అశోక్ కుమార్ స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం మాజీ ఎంపీటీసీ మాట్లాడుతూ వార్డు ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా శివశక్తి అధ్యక్షులు సాయి కుమార్ గౌడ్, కాలనీవాసులు నటరాజ్, శ్రీనివాస్,రాకేష్, యాది, భాగ్యరాజ్ పాల్గొన్నారు.

## కేటీఆర్ అబద్దాలకు అంబాసిడర్: మంత్రి సీతక్క

హైదరాబాద్: అబద్దాలకు అంబాసిడర్‌గా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మారారని మంత్రి సీతక్క అన్నారు. ఆమె బుధవారం కేటీఆర్ 'ఎక్స్'లో పెట్టిన ట్వీట్ పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం బ్రేక్ ఫాస్ట్ స్కీం విషయంలో అవాకులు చవాకులు పేల్చుతున్నారని మండిపడ్డారు.“ సీఎం బ్రేక్ ఫాస్ట్ స్కీంను ఫాల్స్‌గా మార్చిందే మీరు(బీఆర్ఎస్). అల్పహార పథకాన్ని ఆరంభ శూరత్వం చేశారు. మీ నిర్వాకంతోనే 34వ స్థానంలో తెలంగాణ విద్యారంగం ఉంది. ఏజెన్సీలకు గత ప్రభుత్వం పడ్డ రూ.3.5 కోట్లను మా ప్రజా ప్రభుత్వం చెల్లించింది. తెలంగాణ ఏర్పడే నాటికి ప్రభుత్వ పాఠశాలల్లో 24.85 లక్షల మంది విద్యార్థులుంటే.. మీరు దిగి పోయే నాటికి 18.06 లక్షలకు విద్యార్థుల సంఖ్య పడిపోయింది” అని అన్నారు.










## గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహా అన్నదాన కార్యక్రమం

**రఘునాథపల్లి, సెప్టెంబర్ 11 (డైలీ రిపోర్ట్):** రఘునాథపల్లి మండల కేంద్రం లోని ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని మహా అన్నదాన కార్యక్రమం చేయడం జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా ఎస్ఐ . నరేష్, మాజీ జెడ్పిటిసి బొల్లం అజయ్, మాజీ ఎంపీటీసీ ఉష రవి కురుమ, కాంగ్రెస్ మండల అధ్యక్షులు కోళ్ల రవి, కాంగ్రెస్ జిల్లా నాయకులు గాదె మహేందర్ రెడ్డి, ఆదర్శ యూత్ సభ్యులు పేర్నె పరుశురాం, వీరస్వామి, బడితే శ్రీనివాస్, నాగరాజు, పర్శరాములు, నర్సింహులు , వీరేందర్, రవి, లెనిన్, రాజు, ప్రసాద్, కిషోర్, జీకే ఆర్, తదితరులు పాల్గొనారు.

## ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూటీఎస్ కృషి



చేవెళ్ల :సెప్టెంబర్ 11:(డైలీ రిపోర్ట్)పిఆర్టియుటీఎస్ జిల్లా అధ్యక్షులు గోవర్ధన్ యాదవ్ ప్రధాన కార్యదర్శి సామల మహేందర్ రెడ్డి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న సంఘం పి ఆర్టియు సంఘమని జిల్లా అధ్యక్షులు గోవర్ధన్ యాదవ్ తెలిపారు.= PRTUTS చేవెళ్ల మండలం సర్వసభ్య సమావేశం సత్తయ్య అధ్యక్షతన మల్కాపూర్ ఉన్నత పాఠశాలలో జరిగింది. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి సామల మహేందర్ రెడ్డి మాట్లాడుతూ పిఆర్టియు సంఘానికి ఉపాధ్యాయులు అండగా ఉండాలని ఉపాధ్యాయుల సమస్యల గురించి నిరంతరంగా పోరాటం చేసే సంఘం పిఆర్టి టి ఎస్ అని త్వరలోనే సర్వీస్ రూల్స్ ను తీసుకొస్తామని తెలిపారు ఈ సమావేశంలో పిఆర్టియుటిఎస్ చేవెళ్ల మండల శాఖ అధ్యక్షులుగా దయానందం ,ప్రధాన కార్యదర్శిగా రాజశేఖర్ అసోసియేట్ అధ్యక్షులుగా జాన్సన్ ,మహిళా ఉపాధ్యక్షురాలుగా సంగీత ,కార్యదర్శిగా శివకుమార్ ,మహిళా కార్యదర్శిగా అనిత ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు.

## జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసిన బీర్ల సురేష్ యాదవ్



**శంకర్పల్లి సెప్టెంబర్ 11:(డైలీ రిపోర్ట్):**రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లి పట్టణ కేంద్రంలోని జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసిన కురుమ సంఘం యువ నాయకులు బీర్ల సురేష్ యాదవ్ ఈ సందర్భంగా వారు గౌడ సంఘం నాయకులు పండిత్ రావు మాట్లాడుతూ బీసీ సంఘాల కొరకు పాటు పోరాడిన జ్యోతిరావు పూలే జయంతి ఏప్రిల్ 11 ను పురస్కరించుకొని ప్రతి నెల 11 తారీఖు రోజు ఒక్కొక్క కుల సంఘ నాయకులతో పూలమాల వేస్తూ ఈరోజు కురుమ సంఘం నాయకులు బీర్ల సురేష్ యాదవ్ తో పూలమాల వేయించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చెరువులు కుంటల లో ఆక్రమణలు జరగకుండా చర్యలు చేపట్టాలి

**హెచ్ఎండిఏ పరిధి మండలాల లోని చెరువులు, కుంటల వివరాలు సిద్ధం చేయాలి.**

**హెచ్ఎండిఏ వెబ్సైట్ లో 8 మండలాలకు చెందిన చెరువుల ఫైనల్ నోటిఫికేషన్ మ్యాపింగ్ ఉంచాలి.**

**చెరువుల ఎఫ్.టి.ఎల్, బఫర్ జోన్లను గుర్తించి హద్దులను ఏర్పాటు చేయాలి.**

**ఎఫ్ టి ఎల్ బఫర్ జోన్లలో నిర్మాణాలకు అనుమతులు ఇవ్వద్దు.**

**నీటిపారుదల శాఖ, సేర్వే ల్యాండ్ రికార్డ్ , రెవెన్యూ అధికారులతో కలెక్టర్ క్రాంతి వల్లూరు సమీక్ష.**

సంగారెడ్డి సెప్టెంబర్ 11 (డైలీ రిపోర్ట్): జిల్లాలోని చెరువులు కుంటలు కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు రెవెన్యూ , సేర్వే ల్యాండ్ రికార్డ్ ,నీటిపారుదల శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లో జిల్లాలోని హెచ్ఎండిఏ పరిధిలోని ఎనిమిది మండలాలకు చెందిన చెరువులు కుంటల పై తాసిల్దార్లు, నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. హెచ్ఎండిఏ పరిధిలోని ఎనిమిది మండలాలలో 666 చెరువులు, కుంటలకు సంబంధించి ఫైనల్ నోటిఫికేషన్ కొరకు మ్యాప్లను సిద్ధం చేయాలన్నారు. హెచ్ఎండిఏ కు 666 చెరువులకు సంబంధించి ఫైనల్ నోటిఫికేషన్ మ్యాప్లను పంపాలన్నారు. వెబ్సైట్లో 666 చెరువుల వివరాలు పూర్తి స్థాయిలో నమోదు చేయాలన్నారు . చెరువుల మ్యాపులు సిద్ధం చేసేటప్పుడు తప్పులు లేకుండా ఒకటికి రెండుసార్లు సరిచూసు కోవాలన్నారు . గ్రామంలో చిన్న , పెద్ద చెరువుల ఎఫ్ టి ఎల్ పరిధి, బఫర్ జోన్ల హద్దులు గుర్తించి వాటిలో అక్రమ నిర్మాణాలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు . ఇప్పటివరకు హెచ్ఎండిఏకు పంపిన మ్యాప్ లో వివరాలతో పాటు మిగిలిన చెరువుల వివరాలు వీలైనంత త్వరగా అందించాలని అధికారులను ఆదేశించారు. చెరువులు , కుంటల ఎఫ్ టి ఎల్ బఫర్ జోన్లలో నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేసేటప్పుడు తప్పనిసరిగా రెవెన్యూ , నీటిపారుదల శాఖల అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన జరపాలన్నారు. ఎఫ్ టి యల్ పరిధిలో నిర్మాణంలో ఉన్న భవనాలను తొలగించాలన్నారు . ఎఫ్టిఎల్ బఫర్ జోన్లలో ఎటువంటి నిర్మాణాలను అనుమతించొద్దని అధికారులు ఆదేశించారు . జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. ఇండ్లలోకి వరద నీరు రావడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని , వీటన్నిటిని పరిష్కరించాలని ఇలాంటి సంఘటనలు తిరిగి పునరావృతం కాకుండా అధికారులు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెరువులు కుంటలు ఎఫ్టిఎల్, బఫర్ జోన్లతో పాటు వరద కాలువల ఆక్రమణలు జరగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ , జిల్లా సేర్వే ల్యాండ్ రికార్డ్ ఐనేష్ , డి ఈ యేసయ్య , ఈ ఈ భీమ్, హెచ్ఎండిఏ పరిధిలోని ఎనిమిది మండలాల తాసిల్దార్ లు, నీటిపారుదల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## పెళ్లిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా..!

మిల్కీబ్యూటీ తమన్నా భాటియా గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. దాదాపు రెండు దశాబ్దాలుగా టాలీవుడ్లో అగ్రహీరోయిన్గా కొనసాగుతున్నది. 2005లో తెలుగులో శ్రీ మూవీతో టాలీవుడ్లోకి ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత వరుస సినిమాలు చేస్తూ ఫుల్ బిజీగా మారింది. తక్కువ సమయంలో టాలీవుడ్లో టాప్ హీరోయిన్గా ఎదిగింది. ప్రస్తుతం తెలుగుతో పాటు తమిళం, హిందీలోనూ సినిమాలు, వెబ్ సిరీస్ చేస్తూ అలరిస్తున్నది. కొంతకాలంగా విజయ్ వర్మతో మిల్కీబ్యూటీ డేటింగ్ చేస్తున్నది. పెళ్లి చేసుకుంటామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత త్వరలోనే పెళ్లి పీటలక్కెబోతున్నట్లుగా వార్తలు వచ్చాయి. తమన్నా ఎక్కడికి వెళ్లినా పెళ్లిపై ప్రశ్నలు ఎదురుకావడంతో దాట వేస్తూ వచ్చింది. తాజాగా అందరినీ షాక్కు గురి చేస్తూ పెళ్లిపై కీలక కామెంట్స్ చేసింది. ప్రస్తుతం తమన్నా కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్గా మారాయి. మిల్కి బ్యూటీ హైదరాబాద్లో ఓ షాప్ ఓపెనింగ్ కార్యక్రమానికి అతిథిగా హాజరైంది. ఈ సందర్భంగా పెళ్లిపై పలువురు జర్నలిస్ట్లు ప్రశ్నించారు. తాను పెళ్లి చేసుకోవడం లేదు.. కంగారు పడొద్దంటూ వ్యాఖ్యానించింది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది. ఇదిలా ఉండగా.. తమన్నా బాలీవుడ్పై దృష్టి సారించింది. హీరోయిన్తో పాటు అతిథిపాత్రల్లోనూ నటిస్తున్నది. చివరిసారిగా తమిళ రిమేక్ మూవీ బాక్లో కనిపించింది. ప్రస్తుతం తెలుగులో ఓదెల-2 మూవీలో నటిస్తున్నది. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ కొనసాగుతున్నది.



## గాయాలపాలవకుండా యాక్షన్ స్టార్ కాగలనా?

యాక్షన్ సీన్ చిత్రీకరణలో హీరోయిన్ సమంతకు గాయమైంది. ఈ విషయాన్ని తనే స్వయంగా వెల్లడించింది. మోకాలికి అయిన గాయానికి సూదులతో చికిత్స తీసుకుంటున్న ఫోటోను తన ఇన్స్టాగ్రామ్ స్టోరీలో పోస్ట్ చేసింది. గాయాలపాలవకుండా నేను యాక్షన్ స్టార్ అవగలనా? అని అని రాసుకొచ్చింది. అయితే ఏ సినిమా షూటింగ్లో గాయపడిందన్న విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. అయితే సామ్ చేతిలో ప్రస్తుతం బంగారం అనే మూవీ ఉంది. బహుశా ఈ సినిమా చిత్రీకరణలోనే తను గాయపడి ఉండొచ్చని తెలుస్తోంది. కాగా ఈ బ్యూటీ చివరిసారిగా ఖుషి సినిమాలో కనిపించింది. అనంతరం సిటాడెల్: హనీ బన్నీ అనే వెబ్ సిరీస్లో యాక్ట్ చేసింది. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సిరీస్ నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపుకుంటోంది. వరుణ్ ధావన్ హీరోగా, సమంత హీరోయిన్గా నటించిన ఈ యాక్షన్ థ్రిల్లర్కు రాజ్ అండ్ డీకే దర్శకత్వం వహించారు. ఈ సిరీస్ నవంబర్ 7 నుంచి అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కానుంది.

Printed And Published By Bakka Ravinder,on Behalf of Daily Report Publications And broadcasting News, Sangareddy Municipality, Ganesh Nagar HNo 3-11/ Sangareddy District Telangana state , Editor. B. shirisha print code TELTEL.2019/082422 , Cell 8501919707